www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 13 మార్చి 2024
5
అన్నమయ్య



న్యాయం చేయండి : బాధితులు

ప్రజాశక్తి-మదనపల్లి

చీటీల ఏజెంట్ సుధాకరరెడ్డి చీటీలు కట్టి రూ.కోట్లల్లో మోసపోయాం న్యాయం చేయాండని బాధితులు మంగళవారం వన్‌టౌన్ సిఐ వల్లి బాషను ఆశ్రయించారు. స్పందించిన సిఐ సుధాకర్‌రెడ్డికి డబ్బు కట్టిన బాధితులు ఫిర్యాదు ఇస్తే కేసు రిజిస్టర్ చేస్తామని హామీ ఇచ్చారు. సుధాకర్‌రెడ్డి గృహంలో మేనేజర్ కృష్ణమూర్తి, రెడ్డెప్ప, బాషల వద్ద చీటీ డబ్బులు కట్టి వెళ్ళేవాళ్ళమని బాధితులు సిఐకి ఫిర్యాదు చేశారు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇస్తే వెంటనే సుధాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు.



సిఐతో మాట్లాడుతున్న బాధితులు

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

- ఎపి సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - కడప అర్బన్

గ్రామ పంచాయతీలకు చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా రావాల్సిన నిధులు దారి మళ్లించి, గ్రామాల అభివృద్ధిని నిర్వీర్యం చేసి, పంచాయతీ సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాల్లా మార్చిన వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికి ఎన్నికల్లో ఓటమి ఏంటో చూపిస్తామని ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. సర్పంచ్‌ల న్యాయబద్ధమైన 16 డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచ్‌ల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఉమ్మడి జిల్లాలోని సర్పంచ్‌లు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. డిమాండ్లను పరిష్కరించాలంటూ సిఎం డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు వాటా నిధులు ఇవ్వకపోగా, స్థానిక ఆదాయ వనరుల ద్వారా వచ్చే సొంత నిధులను, కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం పంపిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు వేలకోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం సొంత పథకాలకు దారి మళ్లించే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. గ్రామ సచివాలయ వాలంటరీలకు తాము వ్యతిరేకం కాదని, సర్పంచుల ఆధ్వర్యంలో వారు విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. మూడు కోట్ల, 60 లక్షల మంది గ్రామస్తుల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం ముందుంచుతే ఏ మాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు. వైసిపి ప్రభుత్వం సర్పంచ్‌లకు చేసిన అన్యాయాన్ని టిడిపి, జనసేన, సిపిఎం, సిపిఐ అన్ని పార్టీల నేతలకు తెలిపామని చెప్పారు. వైసిపి సర్పంచ్‌లు కూడా ఉద్యమానికి మద్దతు తెలిపి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలకు రెండు నెలల వ్యవధి ఉందని, నిధులు ఇస్తే మంచిదని విలేకర్లు అడిగిన ఒక ప్రశ్నకు బదులిచ్చారు. జగన్‌ను ఇంటికి పంపితేనే పంచాయతీల్లోని గ్రామాలు అభివృద్ధి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నా వైసిపి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేకపోవడం దారుణం అన్నారు. గ్రామ వాలంటరీలను, గ్రామ సచివాలయాలను పంచాయతీల్లో విలీనం చేసి, సర్పంచుల ఆధ్వర్యంలో అన్ని రకాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ సింగంశెట్టి సుబ్బరామయ్య, ఉమ్మడి కడప జిల్లా పంచాయతీల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



వైఎస్‌ఆర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సర్పంచ్‌లు

జిల్లా ఆర్థిక ప్రగతికి విరివిగా రుణాలు

- డిసిసి సమావేశంలో కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

ప్రజాశక్తి - రాయచోటి

ఆర్థిక సంవత్సరంలో జిల్లా వార్షిక ప్రణాళికలను అధిగమించాలని, జిల్లా ఆర్థిక ప్రగతికి విరివిగా రుణాలు ఇవ్వాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన బ్యాంకర్లతో జిల్లా సంప్రదింపుల కమిటీ(డిసిసి), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డిఆర్‌సి) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023- 24ఆర్థిక సంవత్సరంలో మూడవ త్రైమాసికం డిసెంబర్ 31 నాటికి బ్యాంకులు సాధించిన ప్రగతిపై జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ పి.వెంకటేశ్వరరెడ్డి కలెక్టరుకు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యత రంగాలు, ప్రభుత్వ పథకాల రుణాల మంజూరులో బ్యాంకర్లు తమ లక్ష్యాలను తప్పనిసరిగా అధిగమించాలన్నారు. 2023-24 వార్షిక రుణ ప్రణాళికలో డిసెంబర్ 31 మూడవ త్రైమాసికం చివరినాటికి జిల్లాలో మొత్తంగా రూ.8636 కోట్లు లక్ష్యం కాగా, రూ. 10869 కోట్ల రుణాలు అందించి 126 శాతం ప్రగతి సాధించామని చెప్పారు. వ్యవసాయ రంగంలో రూ.6422 కోట్లు లక్ష్యం కాగా రూ.7662 కోట్ల మేర రైతులకు రుణాలు అందించి 119 శాతం, ప్రాధాన్యతా రంగంలో రూ.7633 కోట్లు లక్ష్యం కాగా రూ.8853 కోట్ల మేర రుణాలు అందించి 116 శాతం ప్రగతి సాధించడమైందని తెలిపారు. ప్రధానమంత్రి ఎంప్లాయ్మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా 919 యూనిట్లకు లక్ష్యాన్ని మించి రూ.15.39 కోట్ల మేర రుణాలు అందించారన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు, ప్రోత్సహించడం కోసం మూడవ త్రైమాసికం నాటికి 21686 సూక్ష్మ చిన్న మధ్య తరహా యూనిట్లకు రూ.946 కోట్లు రుణాలు అందించారని పేర్కొన్నారు. తర ప్రాధాన్యత రంగాలలో 13090 యూనిట్లకు రూ.244.67 కోట్లు, డిఆర్‌డిఎ మెప్మా శాఖల ఆధ్వర్యంలో గ్రామీణ పట్టణ ప్రాంతాలలోని 13069 మహిళా సంఘాలకు రూ. 1,191.83 కోట్లు రుణాలు అందజేశారని తెఉలిపారు. మూడవ త్రైమాసికం ముగిసే నాటికి లక్ష్యాలను మించి రుణాలు అందించడంపై బ్యాంకర్లను కలెక్టర్ అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి అమలు చేస్తున్న ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలకు బ్యాంకర్లు తమ వంతు తోడ్పాటు అందించి అధికంగా రుణాలు ఇవ్వాలన్నారు. వీధుల్లో చిరు వ్యాపారులు, చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి పెట్టుబడి కింద బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలని పేర్కొన్నారు. వ్యవసాయంలో ఆరుగాలం శ్రమిస్తున్న కౌలు రైతులకు కూడా విరివిగా రుణాలు అందించి ఆదుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో చర్చించి పలు సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా బ్యాంకర్లతో కలిసి 2024-25 పొటెన్షియల్ క్రెడిట్ ప్లాన్‌ను కలెక్టరు ఆవిష్కరించారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ లీడ్ మేనేజర్ పి వెంకటేశ్వరరెడ్డి, ఎస్‌బిఐ యూనియన్, సప్తగిరి బ్యాంక్ ఆర్‌ఎంలు కె.ఎస్.ఎస్ శర్మ, బి.భాస్కర్, జిఎంవి. ప్రసాద్, నాబార్డ్ ఎజిఎం విజయ్ విహారి, వివిధ బ్యాంకర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



క్రెడిట్ ప్లాన్ పత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, బ్యాంకు అధికారులు

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై పటిష్ట ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ నోడల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో సాధారణ ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులు, అర్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు నోడల్ అధికారులు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ విధుల నిర్వహణకు సిబ్బందిని సమకూర్చుకోవడంతోపాటు గైర్హాజరు కాకుండా రిజర్వు సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బంది, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్స్, వీడియో సర్వైలెన్స్ టీమ్స్, వీడియో వ్యూవింగ్ తదితర అన్ని రకాల ఏర్పాట్లు పక్కాగా ఉండేటట్లు చూడాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ మెటీరియల్ సరఫరా లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌ను ఒకటి రెండుసార్లు విసిట్ చేసి లోకేషన్స్ గుర్తించాలన్నారు. బిఎల్‌ఒలు తమకు కేటాయించిన విధులను పక్కాగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎఎస్‌పి డాక్టర్ రాజ్ కమల్, డిఎఫ్‌ఒ శుభం, డిఆర్‌ఒ సత్యనారాయణ, నోడల్ అధికారులు, ఆర్‌ఒలు పాల్గొన్నారు.

కలసికట్టుగా పనిచేసి ఎన్నికలను విజయవంతం చేద్దాం

ఎన్నికలకు కేటాయించిన సిబ్బంది కలసికట్టుగా పనిచేసి ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. సాయి ఇంజినీరింగ్ కళాశాలలో స్వీప్ కార్యక్రమాలు, ఎంసిసి, ఎంసిఎంసి, ఇవిఎంల నిర్వహణ, ఎన్నికల సంఘం రూపొందించిన మొబైల్ యాప్స్, తదితర అంశాలపై ఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు, డిటిలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితర ఎన్నికల సిబ్బందికి సంబంధిత నోడల్ అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులకు కేటాయించిన డిప్యూటీ తహశీల్దార్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎన్నికలలో కీలకపాత్ర పోషించబోతున్నారన్నారు. వీరందరూ వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించినప్పుడే ఎన్నికల ప్రక్రియ విజయవంతం అవుతుందన్నారు. ఆర్‌ఒలు, తహశీలార్దులు తమకు కేటాయించిన లాగిన్లను చాలా జాగ్రత్తగా వాడుకోవాలన్నారు. స్వీప్ కార్యక్రమాల నోడల్ అధికారి రాజశేఖర్ రెడ్డి, ఎంసిసి నోడల్ అధికారి గురుప్రకాష్, పోస్టల్ బ్యాలెట్, ఇవిఎం నోడల్ అధికారులు జయరాముడు, మద్దిలేటి, ఎన్నికల సిబ్బందికి అవగాహన కల్పించారు. నామినేషన్ల ప్రక్రియపై ఆర్‌డిఒ రంగస్వామి, భారత ఎన్నికల సంఘం రూపొందించిన మొబైల్ అప్లికేషన్లపై సమాచార సాంకేతికత నోడల్ అధికారి హరికృష్ణ అవగాహన కల్పించారు.

రెవెన్యూ ఉద్యోగి భూ ఆక్రమణ

- రాజకీయ పలుకుబడితో రాజ్యమేలుతున్న విఆర్‌ఎ
- పట్టని రెవెన్యూ అధికారులు
- నిద్రమత్తులో జిల్లా యంత్రాంగం



రెవెన్యూ ఉద్యోగి ఆక్రమించిన భూమిలో సాగు చేసిన వరి పంట

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఓ రెవెన్యూ ఉద్యోగి 2.72 సెంట్లు భూమిని ఆక్రమించుకొని యథేశ్ఛగా వ్యవసాయం చేసుకుంటున్నా.. స్థానిక రెవెన్యూ అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలోని ఓ విఆర్‌ఎ తాటిగుంటపల్లిలోని భూమిని అక్రమంగా ఆక్రమించుకొని వ్యవసాయం చేసుకుంటున్నాడు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ఓ విఆర్‌ఏ ప్రభుత్వ భూమిని కబ్జా చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఆక్రమణకు గురైన భూమిలో వరి మడి నాటి వ్యవసాయం చేసుకుంటుండడం, స్థానికంగా రాజకీయంగా పలుకుబడి ఉండడంతో నన్నేమి చేయలేరు అనే ధీమాతో ఆక్రమణలకు పాల్పడుతున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా విఆర్‌ఒ గానీ, తహశీల్దార్ గానీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని, ఈ విషయంపై పలుమార్లు స్థానిక రెవెన్యూ అధికారులకు, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా, స్పందనలో ఫిర్యాదు చేసినా కూడా ఏ మాత్రం పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం చర్చనీయంశంగా మారింది. రెవెన్యూ ఉద్యోగి భూ ఆక్రమణకు పాల్పడితే ఎవ్వరూ పట్టించుకోరు.. అదే సామాన్య ప్రజలు ఇలా చేస్తే అధికారులు చూస్తూ ఉంటారా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. విఆర్‌ఎ భూమి ఆక్రమించుకోవడమే కాకుండా డీ ఫారం పట్టా లేకుండా 1బి, అడంగల్, ఏ రిజిస్టర్ కాపీలో కూడా తన పేరును నమోదు చేసుకోవడంతో రెవెన్యూ అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న విఆర్‌ఏపై చర్యలు తీసుకొని, ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జపాన్ యూనివర్శిటీ ప్రొఫెసర్‌తో శ్రీకాంత్

జపాన్ యూనివర్శిటీని సందర్శించిన 'మిట్స్' ప్రొఫెసర్

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల ఎంబిఎ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బొంతల శ్రీకాంత్ జపాన్‌లోని గకుషుయిన్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. భారతదేశం, ఇండోనేషియా వంటి ఆసియా దేశాలు సాధించిన విజయాల స్థాయి యొక్క సమయ శ్రేణి విశ్లేషణ, ఇతర వాటితో పోల్చడం అనే అంశాలపై పరిశోధన నిమిత్తం జరిగిన ఫాకల్టీ రీసెర్చ్ కొలాబరేషన్ సమావేశంలో పాల్గొనేందుకు ఆహ్వానం లభించిందని పేర్కొన్నారు. ఈ విషయమై ఆయన చర్చించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అందజేసిన జపాన్ ప్రొఫెసర్ యుకారి శిరోటా, ఎకనామిక్స్ ఫ్యాకల్టీ, గకుషుయిన్ విశ్వవిద్యాలయానికి కళాశాల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. బొంతల శ్రీకాంత్‌ను కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ గీతాదేవి, ఇంటెర్నేషన్ రిలేషన్స్ డీన్ శ్రీమంత బసు, సీనియర్ మేనేజర్ యు.విజయ లక్ష్మి, తదితరులు అభినందనలు తెలియాజేశారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి : 'సుగవాసి'

ప్రజాశక్తి-రాయచోటి

రాజంపేట పార్లమెంట్ పరిధిలో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని రాజంపేట పార్లమెంట్ టిడిపి అభ్యర్థి సుగువాసి బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. మంగళవారం రాజంపేట పార్లమెంట్ టిడిపి అభ్యర్థిగా సుగవాసి బాల సుబ్రమణ్యంను టిడిపి అధిష్టానం ఖరారు చేసింది. కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించారు. సత్కరించిన వారిలో టిడిపి రాష్ట్ర ముదిరాజ్ సాధికార కమిటీ సభ్యులు మండ్ల రామాంజనేయులు, టిడిపి రాజంపేట పార్లమెంట్ ముదిరాజ్ సాధికార కమిటీ కన్వనర్ మాగి వెంకట రమణ, టిడిపి రాజంపేట పార్లమెంట్ ఎస్ సెల్ అధ్యక్షులు అమావాస్య రెడ్డయ్య, తంబళ్ళ పల్లి నియోజవర్గ జనసేన నాయకులు ప్రకాష్ రెడ్డి, మస్తాన్,యువ నాయకులు రమేష్, సుదర్శన్ ఉన్నారు.



బాలసుబ్రమణ్యంను సన్మానిస్తున్న నాయకులు

పట్టణ అభివృద్ధి, సుందరీకరణే ధ్యేయం : 'గడికోట'



లైటింగ్ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి రాయచోటి

రాయచోటి పట్టణ అభివృద్ధి, సుందరీకరణే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గుణ్ణికుంట్ల రహదారి మార్గంలో రింగ్ రోడ్డు-పెమ్మాడపల్లె చేరువుకట్ట వరకు నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకుకు అమర్చిన ఎల్ఇడి స్ట్రీట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని గుణ్ణికుంట్ల రహదారి మార్గంలో రహదారిని సుందరంగా విస్తరణ చేయడంతో పాటు నూతనంగా విద్యుత్ స్తంభాలుకు ఎల్ఇడి వీధి లైట్లు ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఎల్ఇడి స్ట్రీట్ లైట్లను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రధాన కూడళ్ళ సుందరీకరణతో పట్టణ అభివృద్ధికి మరో ముందడుగు పడిందన్నారు. పట్టణంలో అభివృద్ధి పనులతో పాటు కూడళ్లలో సుందరీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయని పేర్కొన్నారు. గుణ్ణికుంట్ల రింగ్ రోడ్డు సర్కిల్, చిత్తూరు రహదారి మార్గంలోని సర్కిల్, నేతాజీ సర్కిల్, మాసాపేట-వేంపల్లె సర్కిల్ లలో సుందరీకరణ పనులు ముగింపుదశకు చేరుకున్నాయన్నారు. ఎస్ఎన్ కాలనీలో టవర్ క్లాక్ నిర్మాణం, దిబ్బలబడి సర్కిల్, షాదీ ఖానా వద్ద అబ్దుల్ కలాం విగ్రహం వద్ద సుందరీకరణ నిర్మాణాలు త్వరలో ప్రారంభమవు తాయన్నారు. చెన్నముక్కపల్లె రింగ్ రోడ్డు నుంచి ఠాణా వరకు సెంట్రల్ లైటింగ్‌ను త్వరగా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి, మండల బిసి నాయకుడు పల్లపు రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలిమి హారూన్, షబ్బీర్, ఫయాజ్ అహమ్మద్, నవాజ్, ఆర్ట్స్ శంకర్, జిలాన్ పాల్గొన్నారు.

'పేదలకు మెరుగైన వైద్య సేవలు'

ప్రజాశక్తి-పీలేరు

పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పీలేరు, కెవి పల్లి మండలాల వైసిపి బాధ్యులు పెద్దిరెడ్డి సుధీర్ కుమార్‌రెడ్డి తెలిపారు. కంభంవారిపల్లె మండలం, వగళ్ళ గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని ప్రారంభించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా నేనున్నానని భరోసా కల్పించడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి గ్రామ స్థాయిలో పెద్దఎత్తున ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ప్రత్యేక వైద్య నిపుణులు గ్రామాల్లో పర్యటించి మధుమేహం, రక్తపోటు, కంటి వైద్య పరీక్షలతో పాటు అనేక ఇతర సేవలు అందజేశారన్నారు. శిబిరంలో 406 మంది చికిత్స పొందినట్లు గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ తెలియజేశారు. వారిలో ఇద్దరిని పైస్థాయి వైద్యం కోసం రెఫర్ చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రెడ్డికాంతమ్మ, జడ్‌పిటిసి గజ్జెల శృతిరెడ్డి, ఎంపిటిసి లక్ష్మీదేవి, మండల సచివాలయాల కన్వీనర్ సతీష్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి జయరామ చంద్రయ్య, వగళ్ళ సచివాలయ కన్వీనర్ ఖాదర్ బాష, స్థానిక నాయకులు రామకొండారెడ్డి, వెంకట సిద్దులు, రఘునాధరెడ్డి, గజ్జెల శీనురెడ్డి, మల్లికార్జున, ఎంపిడిఒ యాదవేంద్ర, స్పెషలిస్ట్ వైద్యులు శ్రీనివాస నాయక్ ఆప్కా మాలిక్ ఆఫీసర్ బాబు, సామాజిక ఆరోగ్య అధికారిణి భాగ్యలక్ష్మి, గ్రామ కార్యదర్శి దీపిక పాల్గొన్నారు.



వైద్య కిట్టును అందజేస్తున్న పెద్దిరెడ్డి సుధీర్ కుమార్‌రెడ్డి

ఉద్యోగులకు రహస్య ఓటింగ్ కల్పించాలి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-కలికిరి

ఉద్యోగులకు రహస్య ఓటింగ్ సౌకర్యం కల్పించాలని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం పోస్టల్ బ్యాలెట్ విధానంలో పేపరు బ్యాలట్ ఇస్తున్నారని, దీంతో ఉద్యోగి బ్యాలెట్ కవర్ పై తమ చిరునామా సహా రాయడం వలన లెక్కింపు సమయంలో ఆ ఉద్యోగి ఎవరికి ఓటేశారో



తెలిసిపోతోందని, దాంతో పార్టీల నాయకులు వలన ఉద్యోగులు భవిష్యత్తులో సమస్యలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేసారు. దీని వల్ల ఉద్యోగులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని అన్నారు. ఎన్నికల డ్యూటీ లలో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యలెట్ కాకుండా ప్రజలకు మాదిరిగా ఇవిఎం కేటాయించి, ఆయా మండల కేంద్రంలో ముందురోజే ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు.



అధికారికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న నాయకులు

సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లి

తప్పుడు డాక్యుమెంట్లతో పెన్షన్లు మంజూరు చేసిన సచివాలయ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అనంతరం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కమిటీ సభ్యులు బి.వెంకటేష్, అల్ ఇండియా ఎఐకెఎం జిల్లా రైతు సంఘం నాయకులు పి.రమణారెడ్డి మాట్లాడుతూ కురబలకోట మండలం ముదివేడు గ్రామ సచివాలయంలో గణేష్ అనే వ్యక్తి సమాచార హక్కు చట్టం కింద సమాచారం కోరినా ఇవ్వకుండా వెల్ఫేర్ అసిస్టెంట్ వై.నరసింహులు చాలా ఇబ్బందులకు గురించేశారని ఆరోపించారు. రికార్డులను పరిశీలన చేయగా ఆధార్ కార్డులో రొయ్యల మంజుల అనే మహిళకు తప్పుడు డాకుమెంట్స్‌తో పెన్షన్ మంజూరు చేసినట్లు తేలిందని చెప్పారు. ఆమె ఆధార్ కార్డులో రొయ్యలు మంజుల భర్త పేరు రొయ్యల గణేష్ కాకుండా కాకుండా లేట్ మహబూబ్ బాషాగా చేర్చారని తెలిపారు. డెత్ సర్టిఫిలెట్‌లో కె.మహబూబ్‌బాషా అనే వ్యక్తి 30 ఏళ్ళ క్రితమే మరణించాడని, ఇతను 2023 సంవత్సరం మే 29న మరణించినట్లు తప్పుడు సర్టిఫికెట్‌ను సృష్టించి వితంతు పెన్షను పిఎన్ఎస్ 230530072662కు మంజూరు చేశారన్నారు. మంజుల అవినీతి, ప్రలోబాలకు లొంగిన అధికారులు అక్రమంగా పెన్షన్ మంజూరు చేశారని చెప్పారు. అధికారులపై చట్టపరమైన చర్చలు తీసుకుని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, సురేంద్ర, హరి, రమేష్ పాల్గొన్నారు.

టిడిపితోనే ముస్లిం మైనార్టీల సంక్షేమం : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముస్లిం మైనార్టీల సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్షలు, ప్రార్ధనలు క్రమశిక్షణ పాటిస్తారని తెలిపారు. పెద్ద ఎత్తున పేదలకు జకావత్, పిత్రా పేరుతో దానధర్మాలు చేస్తారని గుర్తు చేశారు. రంజాన్ మాసం ఆదర్శవంతమైన జీవనానికి ప్రేరణ ఇస్తుందని చెప్పారు. ముస్లిం సోదరులు సుఖ సంతోషాలతో రంజాన్ మాసం వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. వైసిపి ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, వారి సంక్షేమం, అభ్యున్నతి కోసం గత తెలుగుదేశం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసిందన్నారు. రంజాన్ పండుగను ప్రతి ఒక్క ముస్లిం మైనార్టీలు సంతోషంగా జరుపుకోవాలని, గతంలో ఉచితంగా రంజాన్ తోఫా కానుకలు అందించామని పేర్కొన్నారు. వారి సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించిందన్నారు. వారి అభ్యున్నతికి తోడ్పడే కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్	షహారీ
బుధవారం (సా)	గురువారం (ఉ)
6.30	5.09



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న ఎంపిపి

గర్భిణులకు ఉచిత భోజన వసతి

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిఎం ఎస్ఎంఎస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ సయ్యద్ జియావుల్లా, డాక్టర్ మనిషాలు పేర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఆరోగ్య కేంద్రానికి వచ్చిన గర్భిణులకు ఎంపిపి రాజేంద్రనాథ్ రెడ్డికి భోజనవసతి కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రతి గర్భిణి తల్లితో సమానమని, వారికి సేవ చేయడం నాకు వరం లాంటిదని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎటువంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకవస్తే తక్షణమే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో లాయర్ పవన్ కుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు, వైద్యసిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థి గెలుపే లక్ష్యం : 'ముక్కా'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు



మాట్లాడుతున్న ముక్కా రూపానందరెడ్డి

రైల్వే కోడూరు నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి గెలుపే తమ లక్ష్యమని టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం విజయ కన్వెన్షన్ హాల్లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు టిడిపి ఇన్‌ఛార్జిగా నియమించిన టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడుకు కృతజ్ఞ తలు తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు కస్తూరి విశ్వనాధనాయుడు, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు, మాచినేని విశ్వేశ్వరనాయుడు, సీనియర్ నాయకులందరితో కలిసి వచ్చే ఎన్నికలలో టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి ఏ పార్టీ వారైనప్పటికీ అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు. అత్యధిక మెజారిటీతో విజయం సాధించి చంద్రబాబుకు బహుమతిగా అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. 2004 సంవత్సరం వరకు రైల్వేకోడూరు టిడిపికి కంచుకోటగా ఉండేదని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి పూర్వవైభవం తీసుకవస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రూపానందరెడ్డి తనయుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి, గడికోట సుబ్బరాయుడు, కట్టా బాలాజీ, గుండయ్య నాయుడు, మధుసూదన్‌రెడ్డి, బి.వేణుగోపాల్ రెడ్డి, కస్తూరి కోటేశ్వర చౌదరి, ముక్కావారిపల్లి సర్పంచ్ అరవశ్రీధర్, మద్దిన శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

నేడు బస్టాండ్ గేటుకు వేలం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నేడు నిమ్మనపల్లి బస్టాండ్ గేటుకు బహిరంగ వేలం పాటను మండల విస్తరణ అధికారి చలపతిరావు, సర్పంచ్ పాపులమ్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రమైన నిమ్మనపల్లిలో 2024-25 సంవత్సరానికి బుధవారం ఉదయం 11 గంటలకు గ్రామ సచివాలయం వద్ద బస్టాండ్ గేటుకు బహిరంగ వేలం పాటను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన పాటాదారులు, పంచాయతీకి ఎటువంటి బకాయిలు లేకుండా ధరావత్తు సొమ్ము రూ.65వేలు చెల్లించిన వారు మాత్రమే వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు. వేలంపాటను దక్కించుకున్న వారు పూర్తి మొత్తం చెల్లించిన తరువాత, వారికి బస్టాండ్ గేటు వసూలు చేయడానికి పూర్తి హక్కులను కల్పించనున్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని సుద్దమల్ల గ్రామం తుమ్మపల్లెలో గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 20 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. బాధిత గొర్రెల కాపరి తోపల్లెకు చెందిన వెంకటరమణ మాట్లాడుతూ తమ ఇంటి సమీపంలో గొర్రెల మందను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున కుక్కలు మందలో జొరబడి దాదాపు 20 గొర్రెలను చంపివేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జీవనాధారం ఏమి లేదని గొర్రెలను మోపుకుంటూ జీవనం సాగిస్తున్నామని అన్నారు. మృతి చెందిన గొర్రెల విలువ దాదాపు రెండు లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని అభ్యర్థించారు. గొర్రెల మందపై కుక్కలు దాడి చేడయం ఇది మూడోసారని, తమ గొర్రెలపై ఎప్పుడు దాడి చేస్తాయో తెలియక భయం గుప్పిట్లో గడుపుతున్నామని అన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చూడాలని అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చలివేంద్రం ఏర్పాటు

రామాపురం : మండల కేంద్రంలోని బస్సు స్టాప్ సమీపంలో అర్షద్ వెల్డింగ్ వర్క్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సరస్వతిపల్లి సర్పంచ్ మునీర్‌బాషా, మైనార్టీ నాయకులు మహబూబ్ బాషాలు ప్రారంభించారు. చలివేంద్ర ఏర్పాటుపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వేసవికాలంలో బస్ స్టాప్ సమీపంలో బస్ స్టాప్ సమీపంలో మండల ఆఫీసులో పని మీద వచ్చే ప్రజలకు దాహార్తించడానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రంజాన్ నెల ప్రారంభ రోజున ప్రజలకు వేసవిలో దాహార్తి తీర్చడానికి తమ చేత చలివేంద్ర ప్రారంభించడం సంతోషదాయకమని అన్నారు.

జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం

రామసముద్రం : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే మళ్లీజగనన్ననే ముఖ్యమంత్రి కావాలని మదనపల్లి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి నిస్సార్ అహ్మద్ పేర్కొన్నారు. మంగళవారం రామసముద్రం మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ జనార్ధన స్వామి ఆలయం ఆవరణలో జరిగిన వైయస్సార్ చేయూత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జగనన్న ఐదు సంవత్సరాల కాలం ముఖ్యమంత్రిగా పనిచేస్తే, రెండేళ్లు పాటు కరోనా మహమ్మారితో రాష్ట్రం ఆర్థికంగా చతికిల పడినా ఎన్నికల మేనిఫెస్టులో ఇచ్చిన వాగ్దానాలు మేరకు నవరత్నాలు పథకాలలో 99 శాతం అమలు చేసిన ఘనత సిఎం జగన్ మాత్రమేనని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరు గ్యారంటీ అని చెప్పినా ఓటేస్తారో లేదో అని ఇటు జన సేనతో అటు బిజెపి పార్టీతో పొత్తు పెట్టుకుని మరొక్కసారి ప్రజలను మోసం చేసేం దుకు మూడు పార్టీలతో కలిసి వస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్‌రెడ్డి, ఎంపిపి కుసుమకుమారి, ఎంపిడిఒ నారాయణస్వామి పాల్గొన్నారు.

ఇకెవైసి వంద శాతం పూర్తి చేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి-వీరబల్లి

వాలంటీర్లు ఇకెవైసి ప్రక్రియను వందశాతం పూర్తి చేయాలని ఎంపిపి రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపిడిఒ రామచంద్రారెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ రామచంద్రరెడ్డి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంపిపి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిపి, ఎంపిడిఒ మాట్లాడుతూ వాలంటరీ వ్యవస్థ తీసుకొచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించేందుకు వాలంటీర్ వ్యవస్థను తీసుకవచ్చారని అన్నారు. మండలంలో కొందరు వాలంటీర్లు విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని, మరికొందరు వాలంటీర్లు ఆసంతృప్తికి లోనవుతున్నారని అన్నారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉదయం 10.30గంటలకు బయోమెట్రిక్ వేయాలని, మూమెంట్ రిజిస్టర్ తప్పని సరిగా పాటించాలని సూచించారు. మధ్యాహ్నం మూడు నుంచి ఐదు గంటల వరకు స్పందన కార్యక్రమంలో కచ్చితంగా ఉండాలని అన్నారు. విధులకు సక్రమంగా హాజరు కాని వారి పైన చర్యలు తప్పవని చెప్పారు.



మాట్లాడుతున్న ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి

ఆరోగ్య స్క్రీన్ హెల్త్ కార్డులు,ఆరోగ్యశ్రీ మిస్సింగ్ కార్డులు, కళ్యాణమస్తు, హెచ్‌సిఎ కరపత్రాలు, సకాలంలో ప్రజలకు చేరవేసి వందశాతం ఇకెవైసి చెయ్యాలని చెప్పారు. కార్యక్రమంలో దిగువ రాచపల్లి సర్పంచ్ నాగులమ్మ, వంగిమల్ల సర్పంచ్ సరస్వతమ్మ, జయచంద్రరెడ్డి, రవికుమార్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం : 'కొరముట్ల'



మహిళకు ఇంటి స్థలం హక్కు పత్రాన్ని అందిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పేదల సొంతింటి కల సాకారమైందని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు, పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా రిజిస్ట్రేషన్ చేసిన 2,200 ఇంటి స్థలాల హక్కు పత్రాలను కొరముట్ల, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. వైఎస్ఆర్ చేయూత నాలుగో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదవారికి ఇంటి స్థలాలు ఇచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వైఎస్ఆర్ ఆసరాతో మహిళల ఆర్థిక అభివృద్ధి చేయూతనిచ్చారని అన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని మరో మారు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, జడ్‌పిటిసి రత్నమ్మ, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోటశివసాయి, ఏరియా కో-ఆర్డినేటర్ నిరంజన్, డిప్యూటీ తహశీల్దార్ అమరేశ్వరి, పట్టణ కన్వీనర్ రమేష్,లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే వైద్య సేవలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు ఇంటి ముంగిటకు వైద్య సేవలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గుండ్లపల్లెలో రూ.21.3 లక్షల అంచనాతో నిర్మించిన డాక్టర్ వైయస్సార్ విలేజ్ క్లీనింగ్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, వైద్యానికి, వ్యవసాయానికి ప్రాధాన్యతనిస్తూ గ్రామీణ పేదలకు అన్ని రకాల చేయూతనిస్తూ అభివృద్ధి బాటలో రాష్ట్రాన్ని ముందుకు నడుపుతున్నారని అన్నారు. గ్రామాలలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సిఎం జగన్‌ను తలుచుకుంటూ ఉండడం సంతోషం కలుగుతుందని తెలిపారు. పేదరిక నిర్మూలనకు అన్ని రకాల సంక్షేమ పథకాలను రాజకీయాలకు కులమతాలకు అతీతంగా అర్హులైన వారందరికీ అందజేసిన ఘనత సిఎంకే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరో మారు వైసిపిని ఆదరించాలని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అనసూయమ్మ, సింగల్ విండో చైర్మన్ భార్గవరెడ్డి, సర్పంచ్ మౌలాలి, నాయకులు అప్పలనాయుడు, ఎరికల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రవి పాల్గొన్నారు.



విలేజ్ క్లీనిక్‌ను ప్రారంభిస్తున్న ద్వారకనాథ్‌రెడ్డి

ఇష్టంతో కష్టపడి చదివితే ఉన్నత ఫలితాలు : ఎంఇఒ



ఎంఇఒలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఇష్టంతో కష్ట పడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంఇఒలు చక్రధర్‌రాజు, నాగతిరుమలరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బిపి శేషయ్య సంస్కృత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఇఒలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ప్రశాతంగా ఉండాలన్నారు. పరీక్షలు రాసేట ప్పుడు తగిన శ్రద్ధతో చక్కగా ముఖ్యమైన పాయింట్లను మార్జిని వదిలి రాస్తే చక్కని దస్తూరికి మంచి మార్కులు వస్తాయని అన్నారు. పధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా ఎదిగి సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు వైవిద్య భరితమైన కోర్సులు ఉన్నాయని కేవలం సైన్సు , మాథ్స్, మాత్రమే కాకుండా అనేక ఉపాధి లభ్యమయ్యేటువంటి కోర్సులు ఉన్నాయని అన్నారు. మీరు భవిష్యత్తులో ఎంచుకునేటప్పుడు జాగ్రత్త ఉన్నట్లయితే మంచి భవిష్యత్తు దొరుకుతుందని కొత్తపేట జిల్లా పరిషత్ హై స్కూల్ సైన్స్ టీచర్ రాజయ్య పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు భానుప్రకాష్, తిరుపతి, గౌసియా, ఓబులేసు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

రైల్వేకోడూరు : వైసిపి 14వ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక వైసిపి కార్యాలయంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజరెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ నాయకులతో కలిసి జండా ఎగరవేసి, కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లా డుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో గడచిన 13 ఏళ్లలో ఎన్నో సవాళ్లను అధిగమించి, సంపూర్ణ ప్రజాబలంతో ప్రభుత్వం ఏర్పాటు చేశారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, ఎపి టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, సీనియర్ నాయకులు ఎల్‌వి.మోహన్‌రెడ్డి, జడ్‌పిటిసి రత్నమ్మ, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకం రాజు, డైరెక్టర్లు ముజీబ్, గునిశెట్టి ప్రశాంతి, పట్టణ కన్వీనర్ రమేష్, సర్పంచ్‌లు, వినోద్, ఎంపిటిసిలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్క రణ చేసి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకు న్నారు. కార్య క్రమంలో వైసిపి నాయ కులు ఆకే పాటి అనిల్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీని వాసులురెడ్డి, కాకతీయ విద్యాసంస్థల అధినేత పోలా రమణారెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షులు కృష్ణారావు యాదవ్, జెసిఎస్ కన్వీనర్ వడ్డే రమణ, మునిసిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘన ంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకు న్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి బైసాని జ్యోతి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిపి దస్తగిరి, వైసిపి మండల అధ్యక్షులు కోళ్ల వాసుదేవరెడ్డి, సర్పంచ్‌లు పోరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, ఆర్.కె.కృష్ణారెడ్డి, ఎఎంసి చైర్మన్ ఉమాపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** మండల కేంద్రంలో వైఎస్ఆర్ సర్కిల్ వద్ద వైసిపి నాయకులు ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెద్ద ఎత్తున బాణాసంచార పేలుస్తూ, కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వచ్చే ఎన్నికల్లో మరల వైసిపిదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చౌడేశ్వర్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు తాళ్ళ చంద్రశేఖర్, వైస్ ఎంపిపి కరీం, కో-ఆప్షన్ సభ్యులు జమాల్‌బాషా, నరేంద్రరెడ్డి, రమణారెడ్డి, రామ్మూర్తి పాల్గొన్నారు.



రాజంపేట : వైసిపి జెండాను ఎగుర వేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, జడ్‌పి చైర్మన్

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో ఆరవ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. 2024-25 విద్య సంవత్సరానికి ఆరవ తరగతికి 40 సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపిసి-40 సీట్లు, ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన బాలికలు ఏప్రిల్ నెల 11వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథలు పిల్లలు, డ్రాప్ అవుట్ పిల్లలు, నిరుపేద ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీ బాలికలు అర్హులు అన్నారు. ఈ అవ కాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. **గాలివీడు :** కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయాల్లో 2024-2025 విద్యాసం వత్సరానికి సంబంధించి ఆరవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 12వ నుంచి ఏప్రిల్ 11 తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకో వాలని పాఠశాల ప్రిన్సిపల్ నీరజ తెలిపారు. ఏడవ తరగతిలో రెండు, ఎనిమిదో తరగతిలో 3, 10వ తర గతిలో రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయని ఈ సీట్లకు కూడా ఈ నెల 12వ తేదీ నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు వనియోగించుకోవాలని సూచించారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడి మృతి తీరని లోటు

గాలివీడు : మండల పరిధిలోని పేరంపల్లిరెడ్డివారిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న గాలివీటి శంకరయ్య(55) మృతి చెందారు. మంగళవారం ఎంఇఒలు పిల్లి నాగరాజు, శ్రీనివాసులు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. దహన సంస్కారాలు మృత్యుని భార్య ఝాన్సీరానికి రూ.25 వేలు నగదు అందించారు. ఉపాధ్యాయుడి కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

ముగిసిన అనంతపురం గంగమ్మ జాతర

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని అనంతపురం గ్రామంలో రెండు రోజులపాటు ఘనంగా జరిగిన గంగమ్మజాతర మంగళవారంతో ముగిశాయి. ఆలయ అధికారులు మైల తిరుణాల నిర్వహించారు. ఆలయ అధికారులు గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజులపాటు ఆలయ ప్రాంగణం జనసంద్రంతో నిండిపోయింది. గంగ స్థానాలతో అధికారులు ముగింపు వేడుకలు నిర్వహించారు.జాతరలో టోల్గేట్ వసూళ్లలో అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేశారని చిరు వ్యాపారస్తులు వాపోయారు. ఆలయ కమిటీ నిర్దేశించిన దానికంటే రెండు మూడు రెట్లు అధికంగా వసూలు చేశారని ఆవేనద వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ లారీకి రూ.1500, ట్రాక్టర్‌కు రూ.1000, పెద్ద హోటల్‌కు రూ.1000, చిన్న హోటల్‌కు రూ.500, కారు లేక జీపు రూ.100, ఎద్దుల బండికి రూ.100 నిర్దేశించారు. నిబంధనలు విరుద్ధంగా టోల్గేట్ టెండర్ దారులు చేరుకుల ట్రాక్టర్ వద్ద రూ.3వేలు, చెరుకుల లారీ వద్ద రూ.4,500, తోపుడు బండి నుంచి రూ.1000 రూపాయలు చొప్పున వసూలు చేశారని దుకాణదారులు పేర్కొన్నారు.



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వైసిపి విజయమే మనందరి ధ్యేయం : 'చింతల'

ప్రజాశక్తి-పీలేరు

వైసిపి విజయమే మనందరి ధ్యేయం కావాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమ వారం మండలంలోని బోడుమల్లువారిపల్లి పంచాయితీ సచివాలయ భవనం, వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేసి వైఎస్.జగన్‌ను మళ్లీ సిఎంగా గెలిపించుకోవాలని అన్నారు. వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ చేరవేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు హరీష్‌రెడ్డి, యువ నాయకులు రాకేష్ రెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి, స్టేట్ జనరల్ సెక్రెటరీ హుమయున్, గిరిధర్‌రెడ్డి, పశ్చిమ రాయలసీమ జిల్లాల జోనల్ మహిళ ఇన్‌ఛార్జి మహిత ఆనంద్, వైసిపి ప్రధాన కార్యదర్శి గుర్రం సురేందర్ రెడ్డి, జావీద్, సునీల్ రెడ్డి, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపి టిసిలు, జడ్‌పిటిసిలు, కన్వీనర్లు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న ముక్కా వరలక్ష్మి

కంటి శస్త్ర చికిత్సకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండలం కేంద్రం పుల్లంపేటలో నివాముస్న సిబ్యాల సుబ్రమణ్యం రాజుకు కంటి చూపు మందగించడంతో శస్త్రచికిత్సకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న ముక్కా రూపానంద రెడ్డి ఫౌండేషన్ అధినేత సతీమణి ముక్కా వరలక్ష్మి కంటి శస్త్రచికిత్స కోసం రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ మండలంలో నిరుపేదలకు సహాయం చేయడమే లక్ష్యంగా ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒబిలి ప్రసాద్, విజయ్, సాయి, శివశంకర్‌రెడ్డి, ప్రభాకర్‌రాజు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో అధికారం

ప్రజాశక్తి-కలికిరి

టిడిపి అధ్యక్షులు చంద్రబాబు ప్రకటించిన ఆరు గ్యారంటీలతోనే టిడిపి,జనసేన ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని పీలేరు టిడిపి అసెంబ్లీ అభ్యర్థి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి సతీమణి తనుజరెడ్డి పేర్కొన్నారు. మండలంలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. మహిళకు ఉచిత ఆర్‌టిసి బస్సు ప్రయాణం, సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500లు అందిస్తారని చెప్పారు. నిరుద్యోగులకు రూ.3వేలు, రైతులకు యేటా రూ.20వేలు ఇస్తారని, బిసిలకు అండగా నిలుస్తారని చెప్పారు.కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి మాలతి, మాజీ సర్పంచ్ గడ్డం అంజమ్మ, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై ఊరేగిన సిద్దేశ్వరుడు

ప్రజాశక్తి-కలకడ



అశ్వవాహనంపై పార్వతీ పరమేశ్వరులు

మండలంలోని దేవళంపేటలో వెలిసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో నిర్వహి స్తున్న బ్రహ్మోత్సవా లలో భాగంగా 9వ రోజు శ్రీకామా క్షి సమేత సిద్దేశ్వరస్వామి అశ్వ వాహనంపై పుర వీధుల్లో ఊరేగారు. మంగళవారం రాత్రి ఏకిలా నాయు డులు స్వామివారికి ప్రత్యే కంగా పూజలు నిర్వహించి బళ్లారి డబ్బులు, చెక్కభజనలు, కోలాటాలు మధ్య దేవలంపేట, ఎర్రయ్యగారిపల్లి, కలకడ పురవీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అఖిలేష్, శ్రీనివాసప్రసాద్, త్రికోటం విజయ సారథి, వెంకటరమణ నాయుడు, మల్లికార్జున నాయుడు, కుమార్‌నాయుడు, రెడ్డప్ప నాయుడు, జనార్ధన్ నాయుడు, రెడ్డిశేఖర్‌నాయుడు, రమేష్ నాయుడు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

టిడిపి నాయకుడు దారుణ హత్య

ప్రజాశక్తి-ములకలచెరువు



హత్యకు గురైన రాజారెడ్డి

మండలంలో టిడిపి సీనియర్ నాయకుడు దారుణ హత్యకు గురైన సంఘటన చోటు చేసుకొంది. మదనపల్లి డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి కథనం మేరకు వివ రాలిలా ఉన్నాయి. మండలంలోని సెంట్రల్ స్కూల్ పంచాయతీ పెద్ద మరవపల్లికి చెందిన రాజారెడ్డి(53) గతంలో బురకాయలకోట గ్రామ కమిటీ అధ్యక్షుడుగా పని చేశారని చెప్పారు. ప్రస్తుతం అయన వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, ఇందులో భాగంగా సోమవారం అర్ధరాత్రి వరకు స్నేహ సంస్థకు కోళ్లను లోడ్ చేసి, కోళ్లఫాంలో నే నిద్రించాడని చెప్పారు. అక్కడే ఉన్న కుమార్తె అల్లుడు ఇద్దరు కలిసి ఇంటికి వెళ్లారని చెప్పారు. తిరిగి ఉదయం 3 గంటల సమయంలో కోళ్ల ఫారం దగ్గరికి వచ్చేసరికి రాజారెడ్డి రక్తపు మడుగులో ఉండడం గుర్తించి వెంటనే ములకలచెరువు పోలీసులకు సమాచారం ఇచ్చారని అన్నారు. విషయం తెలుసుకొన్న సిఐ తమ్మిశెట్టి మధు, ట్రైనీ డిఎస్‌పి ప్రశాంత్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని, జరిగిన హత్య పై స్థానికుల నుంచి వివరాలు సేకరించినట్లు తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ములకలచెరువు సిఐ తమ్మిశెట్టి మధు కేసు నమోదు చేసి, జరిగిన హత్యపై పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. హత్యకు పాల్పడిన నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.

రెండు కార్లు ఢీ : ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-పీలేరు

రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డ సంఘటన మంగళవారం సాయంత్రం పీలేరు మండలం, పొంతలచెరువు క్రాస్ వద్ద చోటు చేసుకుంది. స్థానికి చిత్తూరు రోడ్డులోని మదీనా డీజిల్ మెకానిక్ అధినేత ఎస్ఎం రఫీ(46), అప్సర్(16) బొలెరో వాహనంలో కలకడకు బయలుదేరారు. కలకడకు చెందిన శరవణ కుమార్(26) కారులో పీలేరుకు వస్తూ మార్గం మధ్యలోని పొంతలచెరువు క్రాస్ వద్ద రెండు వాహనాలూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.